# ప్రతి పరీక్షకు ప్రిలిమ్స్



- గ్రూప్స్ పరీక్షలన్నిటికీ నిర్వహిస్తాం
- నోటిఫికేషన్ ఇచ్చిన నెలన్నరలోపే ప్రిలిమ్స్ పూర్తి చేస్తాం
- గ్రూప్ 1 మెయిన్స్ మినహా మిగతా వాటికి ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహిస్తాం
- తప్పు సమాధానాలకు మైనస్ మార్కులు
- నూతన విధానాలు వెల్లడించిన ఏపీపీఎస్సీ చైర్మన్ ఉదయ్‌భాస్కర్

సాక్షి, హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) చేపట్టబోయే అన్ని గ్రూప్స్ పరీక్షలకు ప్రిలిమ్స్, మెయిన్స్ నిర్వహించనున్నట్లు కమిషన్ చైర్మన్ ప్రొఫెసర్ ఉదయ్‌భాస్కర్ తెలిపారు. పరీక్షలకు అభ్యర్థులు లక్షల్లో హాజరయ్యే అవకాశమున్నందున వారందరినీ వడపోసి మెరిట్‌ను ఎంపికచేసేందుకు ఈ విధానం అమలు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. గ్రూప్ 1 మెయిన్స్‌లో మాత్రమే డిస్క్రిప్టివ్ (వ్యాసరూప విశ్లేషణాత్మక) తరహాలో పరీక్ష ఉంటుందని, మిగిలిన గ్రూపుల్లో ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలు ఆబ్జెక్టివ్ తరహాలో ఉన్నందున వాటిని కంప్యూటర్ ఆధారిత ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నట్లు

మిగతా 5వ పేజీలో ▶

# ప్రతి పరీక్షకూ ప్రిలిమ్స్...



▶ మొదటి పేజీ తరువాయి

వివరించారు. ఏపీపీఎస్సీ ద్వారా త్వరలో విడుదల చేయబోయే వివిధ నోటిఫికేషన్లు, పరీక్షలకు ఏర్పాట్లు తదితర అంశాలపై మంగళవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. ''గ్రూప్–1 సహా అన్ని కేటగిరీల పోస్టులకు ఆరేడు లక్షల మంది దరఖాస్తు చేసే అవకాశముంది. వీరందరికీ ఒకే ఒక్క పరీక్ష పెట్టి ఎంపికలు పూర్తిచేయడం సరికాదు, సాధ్యమయ్యేదీ కాదు. ఎక్కడైనా అవాంఛనీయ పరిణామం తలెత్తితే ఇబ్బందులొస్తాయి. అలాగే లక్షల మందికి ఆన్‌లైన్ పరీక్షలకు సరిపడా కంప్యూటర్ పరీక్ష కేంద్రాలూ అందుబాటులో లేవు. ఒకేసారి 50 వేల మంది రాసేందుకు సరిపడా మాత్రమే ఉన్నాయి. అందుకే ఆయా కేటగిరీల్లో అభ్యర్థుల వడపోతకు ముందు ప్రిలిమ్స్ నిర్వహిస్తాం. మెరిట్ సాధించిన వారికి ఆబ్జెక్టివ్ తరహాలో మెయిన్స్‌ను కంప్యూటర్ ఆధారితంగా ఆన్‌లైన్‌లో నిర్వహిస్తాం.'' అని వివరించారు. నోటిఫికేషన్ వెలువడిన నెల లేదా నెలన్నరలో ప్రిలిమ్స్, మూణ్నెల్లలో మెయిన్స్ పూర్తిచేస్తామని చెప్పారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో బయోమెట్రిక్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

## ➡ అభ్యర్థులకూ వెసులుబాటు

అన్ని గ్రూపుల్లోనూ ప్రిలిమ్స్ ద్వారా అభ్యర్థులకు మేలు కలుగుతుందన్నారు. 'ప్రతి నోటిఫికేషన్ తరువాత ఉండే 3,4నెలల సమయంలో శిక్షణ కోసం ఒక్కో అభ్యర్థి నెలకు కనీసం రూ.50 వేలకు తక్కువకాకుండా భరించాల్సి వస్తుంది. నోటిఫికేషన్ ఇచ్చిన నెలలోపు ప్రిలిమ్స్ నిర్వహిస్తే అభ్యర్థులు, వారి తల్లిదండ్రులపై ఈ భారం తగ్గుతుంద'ని చెప్పారు. ప్రిలిమ్స్‌లో అర్హత పొందిన వారే తదుపరి పరీక్షకు సిద్ధమవుతారని, నాన్ సీరియస్ అభ్యర్థులు ముందుగానే తప్పుకొంటారని పేర్కొన్నారు.

## ➡ ప్రశ్నలు, సమాధానాలకు జంబ్లింగ్...

గ్రూప్–1 మెయిన్స్ మినహా తక్కిన అన్నిటికీ కంప్యూటర్ ఆధారిత ఆన్‌లైన్ పరీక్షలు పెట్టడం వల్ల ప్రశ్నపత్రాల ప్రింటింగ్, తరలింపు, సురక్షిత కస్టడీ, పరీక్ష కేంద్రాల్లో పంపిణీ వంటి వాటిల్లో సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. అభ్యర్థులు ఎక్కువ మంది ఉంటే ఒకేరోజు వేర్వేరు స్లాట్లలో పరీక్షలు జరుపుతామని, ప్రశ్నపత్రాలు ఆన్‌లైన్‌లో ఉంటాయి కాబట్టి లీకయ్యే సమస్యే ఉండదన్నారు. పక్కపక్కనే ఉన్న అభ్యర్థులకు ఇచ్చే ప్రశ్నపత్రాలు వేర్వేరుగా ఉంటాయని, ప్రశ్నలు, సమాధానాల ఆప్షన్లకు జంబ్లింగ్ ఉంటుందని చెప్పారు. ఒకరికి ఇచ్చిన పత్రంలోని ప్రశ్నలు వేరే అభ్యర్థికి అదే క్రమంలో రావన్నారు. అలాగే ఒకరికి ఒక క్రమంలో ఉన్న సమాధానాల ఆప్షన్లు పక్కనే ఉన్న మరో అభ్యర్థికి వేరేగా ఉంటాయని వివరించారు.

## ➡ తప్పుడు సమాధానాలకు మైనస్ మార్కులు

గతంలో అభ్యర్థులు తమకు తెలియని ప్రశ్నలకూ సమాధానాలు గుర్తించేవారని, వాటిల్లో కొన్ని కరెక్టు అయితే వారికి అదృష్టం కలసి వచ్చేదన్నారు. దీంతో సరైన సమాధానాలు తెలిసి గుర్తించిన వారికి అవకాశాలు సన్నగిల్లేవని వివరించారు. దీన్ని నివారించడానికి తప్పుడు సమాధానాలకు మైనస్ మార్కుల విధానం పెడుతున్నట్లు చెప్పారు. నాలుగు ప్రశ్నల్లో ఒకటి సరైనదై ఒక మార్కు లభిస్తే తక్కిన మూడింటికీ తప్పుడు సమాధానాలు ఇచ్చే వారికి ఒక్కోదానికి మూడోవంతు మైనస్ మార్కు ఉంటుందని, దీంతో ఆ ఒక్కమార్కూ పోతుందన్నారు. గ్రూప్1 మెయిన్స్‌లో ఇంటర్వ్యూలు పాత విధానంలోనే ఉంటాయని చెప్పారు.

## ➡ బోర్డు సభ్యుల నియామకానికి ప్రభుత్వానికి లేఖ

ఏపీపీఎస్సీ బోర్డులో చైర్మన్‌తోపాటు 9మంది సభ్యులుండాలని, ప్రస్తుతం తనతోపాటు ఒకేఒక్క సభ్యుడు ఉన్నందున మరికొందరు సభ్యులను నియమించాలని ప్రభుత్వానికి లేఖ రాసినట్లు చైర్మన్ వివరించారు. బోర్డులో కనీసం మరో ఇద్దరు ముగ్గురు సభ్యులనైనా నియమించాలని కోరినట్లు ఆయన తెలిపారు.